సాక్షి
చిత్తూరు

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



ఫసల్ బీమా రైతులకు ధీమా
ఫసల్ బీమాతో రైతులకు ధీమా కలుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. - 8లో



పరమదయా'కరి'
తిరుచానూరు పద్మావతీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం రాత్రి గజవాహనంపై ఊరేగారు. - 8లో



వర్షానికి కూలిన పూరిళ్లు
యాదమరి మండలంలో వర్షాలకు రెండు పూరిళ్లు కూలిపోయాయి. దీంతో ఆ ఇళ్ల యజమానులు నిరాశ్రయులయ్యారు. - 8లో

న్యూస్‌రీల్

రాజ్యాంగ నిర్మాతకు రక్షణ కరువు



మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రక్షణ కరువైందని, విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో ఏదో ఒక చోట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు, బాలికలపై దాడులు, అఘాయిత్యాలు, దౌర్జన్యం, విగ్రహాల ధ్వంసం జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో వైఎస్సార్ విగ్రహం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం, శిలాఫలకంపై దాడులు చేసిన దుండగులు నేడు ఏకంగా భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం సిగ్గుచేటన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిని వెంటనే పోలీసులు అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కేసును నీరుగార్చాలని చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించి, ఈ దాడికి పాల్పడిన వారిని, ప్రేరేపించిన వారిని కఠినంగా శిక్షించేంత వరకు వైఎస్సార్ సీపీ పార్టీ తరఫున ఉద్యమిస్తామన్నారు. ఎక్కడైతే విగ్రహం ధ్వంసం చేశారో అక్కడే రాష్ట్ర ప్రభుత్వం మరొక్క అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు హుండీ లెక్కింపు

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం హుండీని మంగళవారం లెక్కించనున్నట్లు ఈఓ గురుప్రసాద్ తెలిపారు. ఉదయం 7 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆస్థాన మండపంలో జరిగే ఈ లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.


పరివాహన్ సర్వర్ డౌన్

కాణిపాకం: రవాణాశాఖకు సంబంధించిన పరివాహన్ సర్వర్ డౌన్ అయ్యింది. దీంతో పౌర సేవలు స్తంభించాయి. మూడు రోజులుగా సర్వర్ మొరాయించడంతో సేవలకు బ్రేకులు పడ్డాయి. వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆధార్ సీడింగ్, ఎల్ఎల్ఆర్, డీఎల్, లైసెన్స్‌లు, వాహనాల రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్, చిరునామా, యాజమాన్య మార్పులు, పర్మిట్ల జారీ, పన్ను వసూలు తదితర కార్యకలాపాలు పరివాహన్ ద్వారా నడుస్తున్నాయి. మూడు రోజులుగా ఈ సర్వర్ మొరాయించడంతో వినియోగదారులు తిప్పలు పడ్డారు. ఈ సేవలను ఆన్‌లైన్‌లో పొందేందుకు తమిళనాడుకు వెళుతున్నారు. కాగా దీని పై అధికారులను వివరణ కోరగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సమస్య ఉందని, త్వరితగతిన పరిష్కారమవుతుందన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 67,496 మంది స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు స్వామివారి హుండీలో రూ.3.35 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

దారుణాలు



గుంతలమయమైన వి.కోట- కేజీఎఫ్ అంతర్రాష్ట్ర రహదారి

రహదారులు అసలే అంతంత మాత్రం.. ఆపై ఫెంగల్ ప్రభావం.. విడవని వర్షం.. రోడ్లన్నీ ఛిద్రం.. పట్టించుకోని కూటమి ప్రభుత్వం.. బాటలన్నీ బాగు చేస్తామని ప్రచార ఆర్భాటం.. వెరసి.. అడుగు తీసి అడుగు వేయలేని జనం.. బండి తోలాలంటే ఒళ్లు హూనం.. ప్రయాణం నరకం.. దినదిన గండం .. దారికో దండం అన్న చందంగా దారులన్నీ దారుణంగా మారాయి. నిత్యం ప్రమాదాలు జరిగి వాహన చోదకులు ప్రాణాలు కోల్పోతున్న వైనం. ఇదీ జిల్లా వ్యాప్తంగా రహదారులు దుస్థితి.

రహదారుల్లో నరకయాతన
- పెద్దపెద్ద గుంతలతో దర్శనమిస్తున్న రహదారులు
- ఫెంగల్ తుపాను ప్రభావంతో మరింత దారుణం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం, కూటమి పాలకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పలు రోడ్లు ఛిద్రమయ్యాయి. ఫెంగల్ తుపాను ధాటికి మరింత దారుణంగా మారాయి. వర్షపు నీటితో చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. ఆ నీటిలో భారీ వాహనాలు రాకపోకలతో ఉన్న కాస్త తారు లేచిపోయి గోతులు మరింత లోతు అయ్యాయి. దీంతో వాహనచోదకులు గోతులను తప్పించే ప్రయత్నంలో కొందరు పక్క నుంచి వెళ్లే వాహనాలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. మరికొందరు భారీ వాహనాల వెనుక వైపు వెళుతు...రోడ్డు పైపడిన గోతులను గమనించక అదుపుతప్పి పడిపోతున్నారు. నగరాలు, పట్టణాలు, పల్లెల్లో అంతర్గత రహదారుల పరిస్థితి సైతం అధ్వానంగా మారింది.

రోడ్లు ఛిద్రం

ఇటీవల కూటమి ప్రభుత్వం గొప్పగా గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం మొదటి రోజు అట్టహాసంగా నిర్వహించి ఫొటోలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పెట్టుకున్న కూటమి ఎమ్మెల్యేలు ఆ తర్వాత ఆ కార్యక్రమాన్ని నీరుగార్చారు. దీంతో పబ్లిసిటీ కోసం మాత్రమే కూటమి ప్రభుత్వం రోడ్లు పూడ్చే కార్యక్రమం నిర్వహించిందని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. మరికొన్ని చోట్ల రోడ్లు పూడ్చే కార్యక్రమం పేరుతో నిధులు దోచేసేందుకు మాత్రమే నిర్వహించారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. అయితే జిల్లా వ్యాప్తంగా రోడ్ల పరిస్థితి ఏ మాత్రం మారలేదు.

పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళెం మండలంలో రెండు రోజులుగా కురిసిన అధిక వర్షాలకు సిమెంట్ రోడ్డు లేని గ్రామాల్లో అధికంగా నీరు చేరాయి. వీధులు బురదమయంగా మారాయి. వీధుల్లో వర్షపు నీరు వెళ్లే కాలువలు లేకపోవడంతో అధికంగా వర్షపు నీరు నిల్వ ఉండడంతో గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



గుడిపాల మండలంలో చిత్తూరు-వేలూరు మార్గంలో గుంతలు పడిన రోడ్డు

పలు చోట్ల నరకయాతనే..

పలమనేరు నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి ఘోరంగా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు మరింత దెబ్బతిన్నాయి. పలమనేరు మండలంలోని ఎరగ్రుండేపల్లి మాదిగబండ రహదారిలో జెల్లీ ఫ్యాక్టరీ వద్ద రోడ్డుపై నాలుగు అడుగుల నీళ్లు నిలిచాయి. వి.కోట మండలం వి.కోట–కేజీఎఫ్ అంతర్రాష్ట్ర రహదారి గుంతల మయంగా మారింది. ఇక పట్టణంలోని భరత్ నగర్ రోడ్డు మరింత ఘోరంగా ఉంది. బైరెడ్డి పల్లి మండలంలోని పాతూరు కడప రోడ్డు కనీసం బైకులు వెళ్లడానికి కూడా కుదరడం లేదు.



గుంతలమయమైన వి.కోట- కేజీఎఫ్ అంతర్రాష్ట్ర రహదారి

గంగవరం మండలంలోని చీలపల్లి రోడ్డు ఎటు చూసినా గుంతలే. మండల కేంద్రమైన గంగవరం వద్ద బైపాస్ రోడ్డులోనే పెద్ద గుంతలు పడ్డాయి. వీటి కారణంగా ఇక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్దపంజాణి మండలంలోని చెన్నారెడ్డిపల్లి మార్గంలో రహదారి తీవ్రంగా దెబ్బతింది. మొత్తం మీద పలమనేరు నియోజకవర్గంలో రోడ్లు అత్యంత ఘోరంగా మారాయి.

నగరి నియోజకవర్గం నింద్ర మండలంలో కవరంబాకం గ్రామానికి వెళ్లే దారి పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. ఆ దారిలో వెళ్లాలంటే గ్రామస్తులు హడలెత్తిపోతున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనతో అదే రోడ్డులో గ్రామస్తులు ప్రయాణాలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నింద్ర మండలం కవరంబాకం దారిలో పడిన గుంతలు



గంగాధరనెల్లూరు: ముష్టిపల్లి రోడ్డులో గోతులు



పాలసముద్రం: వెంగల్‌రాజుకుప్పం రోడ్డు దుస్థితి

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో రోడ్లు బాగుచేయించాలని ఎన్ని సార్లు మొరపెట్టుకుంటున్నా ఎమ్మెల్యే కానీ, అధికారులు కానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు నియోజకవర్గంలోని పాలసముద్రం మండలం వెంగల్‌రాజుకుప్పం రోడ్డు అధ్వానంగా తయారైంది. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం నుంచి ముష్టిపల్లికు వెళ్లే రోడ్డు గుంతలమయం అయ్యింది.

అంతర్రాష్ట్ర రహదారి సైతం అధ్వానంగా..



గుడిపాల మండలంలో అధ్వానంగా ఉన్న చిత్తూరు-వేలూరు రోడ్డు

చిత్తూరు-వేలూరు అంతర్రాష్ట్ర గుడిపాల మీదుగా వేలూరు వైపుగా తమిళనాడుకు వెళుతుంది. ఈ రహదారిలో నిత్యం వేలాది మంది ప్రయాణాలు చేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం ప్రయాణం చేసే వారితోపాటు అత్యవసర పరిస్థితుల్లో తమిళనాడులోని ఆస్పత్రులకు అంబులెన్స్‌ల్లో అధిక సంఖ్యలో వెళుతుంటారు. అలాంటి ఈ రహదారి గుంతలమయమై అధ్వానంగా మారింది. అత్యవసరంగా ప్రాణాపాయ స్థితుల్లో ఆస్పత్రికి వెళ్లే ఈ రహదారి అధ్వానంగా ఉండడంతో రోగులు, వారి సహాయకులు, అంబులెన్స్‌ల డ్రైవర్లు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒక్కొక్క సారి రోగిని సకాలంలో ఆస్పత్రికి తరలించకపోవడంతో అతడి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుడిపాల మండలంలో చెన్నై క్రాస్ రోడ్డు నుంచి ఒక కిలోమీటరు వరకు రహదారి పెద్ద పెద్దగా గుంతల పడి, అత్యంత దారుణంగా ఉంది.



కల్వర్టు నిర్మించాలి



ఐరాల మండలం నాగంవాండ్లపల్లె పంచాయతీ మొరవవడ్డీపల్లె గ్రామానికి వెళ్లే ముందు రోడ్డులో వాగు ప్రవహిస్తోంది. మా గ్రామానికి వెళ్లాలంటే ఆ వాగు వైపుగా వెళ్లాల్సిందే. వేరేదారి లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు అధికంగా చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అలాగే గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు బురదమయం అయ్యింది. ఆ రోడ్డులో కాలు తీసి కాలు వేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు గ్రామంలో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వర్షం పడితే నీరు రోడ్లపైనే నిల్వ ఉంటున్నాయి. కల్వర్టు, సీసీరోడ్డు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని ఎన్ని సార్లు పాలకులకు, అధికారులకు చెబుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

– వెంకటరమణ, మొరవవడ్డీపల్లె, ఐరాల


కొత్త రోడ్డు వేయాలి



చిత్తూరు నగరంలోని చవటపల్లె మీదుగా సంతపేటకు రోజు పలువురు ప్రయాణిస్తున్నారు. మా పిల్లలను రోజు సంతపేట పాఠశాలలో వదిలేసి వస్తాను. ఆ తర్వాత ఇంటికి వచ్చి టిఫిన్ చేసి టౌన్‌కు వెళ్లి రావాలంటే ఒళ్లు హూనం అవుతోంది. రాత్రి సమయంలో వీధిలైట్లు పనిచేయవు, వర్షం పడితే అంతే సంగతి. గుంతల్లో నీరు నిండిపోయి దారి తెలియక పలువురు కిందపడి గాయలపాలవుతున్నారు. కొత్తగా రోడ్డు వేసి దారి సౌకర్యం కల్పించాలి.

– కృష్ణ, స్థానికుడు

రూ.103 కోట్ల మద్యార్పణం



మందుబాబులు గమ్మత్తుగా తాగేస్తున్నారు. ఎంతగా అంటే.. 45 రోజుల్లో రూ.103 కోట్ల విలువైన మద్యం విక్రయం జరిగింది. ఇది గతంలో కంటే 63 శాతం అధికం. దీని అర్థమేమిటంటే.. పేదవాడి సంపాదనంతా మద్యార్పణమే. అభివృద్ధి అంటే.. సామాన్యుడి ఆదాయాన్ని లాగేసుకుని.. అతడి జీవితం బుగ్గి చేయడమేనా? అని పలువురు విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

- జిల్లాలో భారీగా పెరిగిన మద్యం అమ్మకాలు
- గతేడాదితో పోలిస్తే.. ఇది 63 శాతం అధికం
- ధరలు తగ్గించామని మందుబాబుల జేబులు ఖాళీ

చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారో దేవుడికెరుక. కానీ జనం వద్ద ఉన్న డబ్బులను మాత్రం మద్యం రూపంలో లాగేసుకుంటోంది. ఎంతగా అంటే 45 రోజుల్లో జిల్లాలో రూ.103 కోట్లకు పైనే మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వం ఖజానా నింపుకుంది. గతేడాది ప్రభుత్వ మద్యం దుకాణాల్లో జరిగిన అమ్మకాలతో పోలిస్తే ఇది ఏకంగా 63 శాతం అధికం.

గతంలో తగ్గిన అమ్మకాలు

సమయం కలిసిరాకపోతే ఎంతటి వారైనా నిందలు అనుభవించాల్సిందే. కృష్ణుడంతటి వాడే.. శమంతక మణిని దొంగిలించాడనే నింద మోయక తప్పలేదు. ఇపుడు ఇదంతా ఎందుకంటారా..? గత ప్రభుత్వ హయంలో మద్యం ధరలు పెంచేశారనే నిందించారే తప్ప, పెరిగిన ధరలతో అమ్మకాలు తగ్గాయన్న విషయం చూడలేదు. కానీ ప్రస్తుతం మద్యం ధరలు తగ్గించామని అబద్దాలు చెబుతూ, మందుబాబుల్ని నిషా చుట్టూ కట్టిపడేస్తున్నారు. తాగినోడికి తాగినంత తాపిస్తున్నారు. ఫలితంగా ఆడ పడచుల సంపాదన సైతం మందుబాబులు మద్యానికి అర్పిస్తున్నారు.

రూ.వంద కోట్లు దాటిన వ్యాపారం

కేవలం 45 రోజుల్లో జిల్లాలో మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.వంద కోట్లు చేరిపోయింది. ఈ ఏడాది అక్టోబర్ 16వ తేదీ నుంచి ఆ నెలాఖరు వరకు దాదాపు రూ.32.13 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గతనెల మొత్తం కలిపి రూ.66.23 కోట్ల వ్యాపారం జరిగింది. అంటే రూ.103 కోట్లకు పైనే విలువ చేసే మద్యాన్ని ప్రభుత్వం మందుబాబులతో తాగించిందనేది స్పష్టమవుతోంది. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కటంటే ఒక్క సంక్షేమ పథకం కూడా ప్రజలకు అమలు చేయలేదు. సూపర్ సిక్స్, మానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలకు ఎలాంటి ఆర్థిక లాభం చేకూరలేదు. పైగా సంక్షేమ పథకాలు ఇవ్వకపోగా.. జనం వద్ద ఉన్న డబ్బులను మద్యం రూపంలో లాగేసుకుంటోంది. ఫలితంగా ప్రజల ఆర్థిక పరిస్థితిని మరింత బలహీనపరుస్తోంది.

జిల్లాలోని మద్యం విక్రయాలిలా

	2024- నవంబర్ నెల అమ్మకాలు		2023-నవంబరు నెల అమ్మకాలు		
సర్కిల్ పేరు	మద్యం (బాక్సులు)	బీరు (బాక్సులు)	మద్యం (బాక్సులు)	బీరు (బాక్సులు)	పెరుగుదల (శాతం)
చిత్తూరు అర్బన్	22,404	7,211	19,398	5,532	23
చిత్తూరు రూరల్	15,497	4,069	16,142	3,690	6
కార్వేటినగరం	7,214	1,946	5,734	1,046	51
నగరి	10,33	13,441	8,674	1,545	71
పుంగనూరు	10,605	4,390	6,744	2,633	62
పలమనేరు	11,116	3,586	5,885	1,569	108
కుప్పం	9,434	3,788	2,991	1,372	195
పులిచెర్ల	5,298	1,636	6,327	1,491	7
మొత్తం	91,902	30,067	71,895	18,878	63

భారీగా అమ్మకాలు

జిల్లాలో గతేడాది నవంబర్‌లో ఇప్పుడెన్ని మద్యం దుకాణాలున్నాయో అవే ఉన్నాయి. కాకపోతే అప్పుడు ప్రభుత్వ మద్యం దుకాణాలు.. ఇప్పుడు ప్రైవేటు దుకాణాలు. గత సవంత్సరం ఎక్సైజ్ పరిధిలో ఉన్న ఎనిమిది సర్కిళ్లల్లో అత్యధికంగా చిత్తూరు అర్బన్‌లో 19,398 బాక్సుల మద్యం, 5,532 బాక్సుల బీర్లు అమ్ముడైతే, అదే ఈ ఏడాది నవంబర్‌లో మద్యం, బీర్లు మొత్తం కలిపి దాదాపు 30 వేల బాక్సులు విక్రయం జరిగింది. అంటే సరాసరి 23 శాతం అమ్మకాలు పెరిగాయి. కుప్పం లాంటి సర్కిల్‌లో గతేడాది ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 2,991 బాక్సుల మద్యం, 1,372 బాక్సుల బీర్లు అమ్ముడైతే.. ఈ ఏడాది అదే సర్కిల్‌లో ఏకంగా 9,434 బాక్సుల మద్యం, 3,788 బీర్లు అమ్ముడయ్యాయి. ఇది ఏకంగా 195 శాతం అమ్మకాలు పెరిగినట్లు చెబుతోంది. అంటే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో జరిగిన వ్యాపారం కంటే, ఇపుడు ప్రైవేటు మద్యం దుకాణాల్లో విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయి.



పూతలపట్టు మద్యం డిపోలో నిల్వ ఉన్న మద్యం బాక్సులు

పోలీసు గ్రీవెన్స్‌కు 24 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

చిత్తూరుఅర్బన్: పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 24 ఫిర్యాదులు అందాయి. సోమవారం చిత్తూరులోని పోలీసు ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ, ఏఎస్పీ రాజశేఖర్ రాజు ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించడంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. ఇందులో పోలీసుల సమస్యలు, కుటుంబ తగాదాలు, వేధింపులు, నగదు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులున్నాయన్నారు. వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాటిని పరిష్కరించాలన్నారు.

క్లుప్తంగా

వరసిద్ధుడి సేవలో తెలంగాణ ఎన్‌సీసీ డీజీ



చిత్రపటం అందుకుంటున్న తెలంగాణ ఎన్‌సీసీ డీజీ

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామివారిని సోమవారం తెలంగాణ ఎన్‌సీసీ డీజీ మధుసూదన్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చూశారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు అందజేసి, తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ గురుప్రసాద్, సిబ్బంది వాసు, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ జయరామయ్య కథనం మేరకు.. నగరంలోని టాప్‌లైన్ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం వన్‌టౌన్ పోలీసులు ఆ ప్రదేశంలో తనిఖీలు నిర్వహించారు. శరవణపురానికి చెందిన రామ్మూర్తి (60), ముత్యాలమ్మ గుడి వీధికి చెందిన చేతన్ (21) అనే ఇద్దరు అనుమానాస్పదంగా తిరుగుతుంటే తనిఖీ చేశారు. నిందితుల వద్ద ఓ సంచిలో 2.175 కిలోల గంజాయి లభించింది. వీరిలో రామ్మూర్తిని రెండు నెలల క్రితం వన్‌టౌన్ పోలీసులు గంజాయి కేసులో అరెస్టు చేసినట్లు గుర్తించారు. ఇప్పుడు మరోసారి గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. కాగా నిందితులిద్దరినీ అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, రిమాండ్‌కు ఆదేశించారు. దీంతో చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు. కాగా నిందితులు ఓసారి నేరం చేసి, మార్పురాకుండా మళ్లీ నేరాలు చేస్తుండడంతో వీళ్లపై పీడీ యాక్టు ప్రయోగించే విషయాన్ని ఉన్నతాధికారులతో చర్చించనున్నట్టు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



విజయ్(ఫైల్)

పలమనేరు: పట్టణంలోని గొబ్బిళ్లకోటూరు గ్రామానికి చెందిన విజయ్ (20) అనే యువకుడు సోమవారం అనుమానాస్పందంగా మృతి చెందాడు. గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని వేలాడుతుండగా గ్రామస్తులు గమనించారు. మృతదేహంపై గాయాలుండడంతో ఇది హత్య? లేదా ఆత్మహత్య అనే అనుమానం ఉందని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టమ్ నివేదిక ఆధారంగా వివరాలు తెలుస్తాయని స్థానిక పోలీసులు తెలిపారు.

వినాయకా.. ఏమిటీ రాజకీయ క్రీడ?

ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలు.. అవి పవిత్రకు అడ్డాలు.. ప్రశాంతతకు క్షేత్రాలు.. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కోవెలలు రాజకీయ రంగులు పులుముకుంటున్నాయి. అధికారపార్టీ దోపిడీకి రాజమార్గాలుగా మారుతున్నాయి. ప్రస్తుతం కాణిపాక క్షేత్రంలో కూటమి నేతలు రాజకీయ చదరంగం ఆడుతున్నారు. స్వార్థపరులు ఆడుతున్న క్రీడలో నిజాయితీ పరులైన అధికారులు, సిబ్బంది బలవుతున్నారు. భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు.

- అర్చకులు, అధికారులపై కత్తి
- సిబ్బందిపై కూడా రాజకీయ రంగులు
- ఈఓల మార్పుపై విమర్శలు
- దెబ్బతింటున్న ఆలయ పవిత్రత



సాక్షి టాస్క్‌ఫోర్స్: కాణిపాకం క్షేత్రం రాజకీయ రంగు పులుముకుంది. దేవస్థానాన్ని కూటమి తమ అడ్డాగా మార్చుకునేందుకు కుట్రలు చేస్తోంది. ఆలయంలో రాజకీయ చదరంగం ఆడుతోంది. మాట వినని ఈఓలపై వేటు వేస్తోంది. అర్చకులు, అధికారుల మెడపై కత్తి పెడుతోంది. సిబ్బందిపై కూడా పెత్తనం చలాయిస్తోంది. తద్వారా ఆలయ నిర్వహణ గాడితప్పుతోంది. ఆలయ పవిత్రత దెబ్బతింటోంది. దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో కాణిపాక దేవస్థానం ఒకటి. సత్యప్రమాణాల దేవుడిగా ఈ స్వామివారికి పేరుంది. ఆలయానికి రోజు వారీ ఆదాయం రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. భక్తులు కానుకలను 20 రోజులకు ఒకసారి లెక్కిస్తే ఆ ఆదాయం రూ. 2 కోట్లు దాటుతోంది. అన్నదానం, గో సంరక్షణ ట్రస్టుల ద్వారా నెలకు రూ. 20 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు వస్తోందని అధికారులు చెబుతున్నారు. షాపులు, ఆలయ నిర్వహణ తదితరాల టెండర్ల ద్వారా ఆలయానికి రూ.కోట్ల రాబడి వస్తున్నట్లు వారంటున్నారు.

ఆదాయంపై కూటమి కన్ను?

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీ నేతలు కొందరికి ఆలయ ఆదాయంపై కన్ను పడింది. ఆదాయ వనరుల మూలలను గుర్తించారు. ఒక్కొక్కటికి లాక్కొవాలని ప్రయత్నాలు మొదలుపెట్టారు. షాపులు, క్యాంటీన్లు, ఆలయ ఆవరణలో పాదరక్షల కౌంటర్, నేతిదీపాల నిర్వహణ, వాహన పూజ తదితరాల నిర్వహణపై గురిపెట్టారు. టెండర్లు లేకుండా దక్కించుకోవాలనే ప్రయత్నాలు చేశారు. బ్రహ్మోత్సవ నిర్వహణ తమ కన్నుసన్నల్లోనే జరగాలని కుట్ర రాజకీయాలకు ఆజ్యం పోశారు. ఇందుకు ముందుగా అధికారులను తమ వశం చేసుకునేలా చూశారు. కానీ పక్షంలో కొందరిపై బదిలీ వేటు వేయించారు. ఇక కార్యాలయంలో వివిధ క్యాడర్‌లో పనిచేసే అధికారులు, సిబ్బందిని ఇష్టానుసారంగా మార్పులు చేర్పులు చేశారు. ప్రస్తుతం చాలా మందిపై ఒత్తిడి తెస్తున్నారు.

బదిలీలు.. స్థాన చలనాలు ఇలా..

- తొలుత కార్యాలయం, ఆలయాల్లో పనిచేసే ఏఈఓలు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లు, ఆలయ సిబ్బంది స్థానాలను మార్పులు చేర్పులు చేశారు. ఈ మార్పులు పార్టీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల వ్యవధిలోనే జరిగాయి. ఈ కారణంగా ప్రొటోకాల్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటోంది. దీనిపై పలువురు ప్రముఖులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.
- కాణిపాకం దేవస్థానానికి ఈఓగా పనిచేసిన వెంకటేశులు ఆలయ రూపురేఖలు మార్చడంలో కీలకప్రాత పోషించారు. అయితే కూటమి అధికార దాహానికి బలయ్యారు. ఈయన వైఎస్సార్‌పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని, కక్షకట్టి బదిలీ వేటు వేయించారు. ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డిని శ్రీకాళహస్తికి బదిలీ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల కాలంలోనే వీరిని ఆలయం నుంచి తప్పించారు.
- ఈఓ వెంకటేశులు బదిలీ అనంతరం కాణిపాకంలో ఏసీగా పనిచేస్తున్న వాణికి అదనపు బాధ్యతలు అప్పగించారు. నెల రోజుల పాటు ఆమె ఇన్‌చార్జి ఈఓగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవ నిర్వహణ, టెండర్ల సక్రమంగా నిర్వర్తించాలని చూశారు. అయితే ఇది గిట్టని కొందరు నేతలు ఈమెను తప్పించాలని ప్రయత్నించారు. బ్రహ్మోత్సవం ప్రారంభానికి ముందే ఇన్‌చార్జి స్థానం నుంచి వాణిని దూరం చేశారు.
- ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్న శేఖర్‌పై రాజకీయ ముద్ర వేశారు. తప్పుడు పత్రాలు సృష్టించారనే కారణంగా విధుల నుంచి తొలగించారు. అయితే ఇలా చాలా మంది విధులు నిర్వహిస్తున్నారని జోరుగా విమర్శలు వస్తున్నాయి. వారిపై కూడా విచారణ జరిపి ఎందుకు చర్యలు తీసుకోకూడదని భక్తులు ప్రశ్నిస్తున్నారు.
- కూటమికి అనుకూలంగా లేని హోంగార్డులపైనా కక్షకట్టారు. ఇప్పటికి 12 మందికి రాజకీయ రంగు పులిమి ఇతర కార్యాలయాలకు బదిలీ చేశారు. మరి కొంత మందిని కూడా పంపించాలనే ప్రయత్నాల్లో ఉన్నారు.
- ఆ తర్వాత నేతలు తమకు అనుకూలంగా వ్యవహరించే అధికారిని ఈఓగా తెచ్చుకోవాలని పట్టుపట్టారు. డీసీగా పనిచేస్తున్న గురుప్రసాద్‌కు అదనపు బాధ్యతలు ఇప్పించారు. ఈయన బ్రహ్మోత్సవ నిర్వహణ, టెండర్ల విషయంలో వారు చెప్పినట్లే వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయి. వాహనపూజ టెండర్లు, షాపులు, ఇతరాత్ర నిర్వహణ టెండర్లు వాయిదా వేస్తూ...అనుకూలమైన వ్యక్తులకు కట్టబెట్టారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ ఫలితంగా నేతలకు అంటకాగుతున్న ఆయన్నే ఇక్కడే కొనసాగించాలని పట్టుపడుతున్నారు.

పెంచల కిషోర్‌పై కూడా..

అధికారులంటే తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ..వ్యవస్థను గాడిలో పెట్టాలనే లక్ష్యంతోనే పనిచేస్తారు. ఆ వ్యవస్థను అభివృద్ధి పథంలో నడిపించాలనే చూస్తుంటారు. అయితే ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి కాస్త అనుకూలంగానే ఉంటుంటారు. చేసే పనిలో మంచి పేరు తెచ్చుకోవాలని చాలా మంది ఒదిగి విధులు నిర్వర్తిస్తుంటారు. 70 శాతం ఉద్యోగులు రాజకీయాలకు దూరంగా ఉంటుంటారు. కానీ పక్షంలో కలిసిపోయి మచ్చ లేకుండా పనిచేసుకుని వెళ్లిపోతుంటారు. అయితే రెండు రోజుల క్రితం పెంచల కిషోర్‌ను కాణిపాకం ఈఓగా నియమించారని తెలియడంతో స్థానిక కూటమి నేతలు కొందరు గొంతు చించుకుంటుస్తున్నారు. ఆయన వైఎస్సార్‌సీపీ వ్యక్తి అంటూ ముద్ర వేశారు. గురుప్రసాద్‌ను కొనసాగించాలని పట్టుబడుతున్నారు. అయితే టెండర్ల విషయంలో గురుప్రసాద్‌పై ఫిర్యాదులు, బ్రహ్మోత్సవాల సమయంలో ఓ ప్రజాప్రతినిధి వ్యవహార శైలిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. టీడీపీలోని ఓ వర్గం కాణిపాకంలో జరుగుతున్న అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధినేతల దృష్టికి తీసుకెళుతున్నట్లు సమాచారం. ఇవన్నీ గుర్తించిన ప్రభుత్వం పెంచల కిషోర్‌కు అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. స్థానిక నేతలు, ఓ ప్రజాప్రతినిధి కూడా పెంచల కిషోర్ నియమాకాన్ని వ్యతిరేకించడంతో భక్తుల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. అయితే అధిష్టానం కాణిపాకంలో జరిగే అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని చూస్తోందని సీనియర్ నాయకులు చెబుతున్నారు.

ఫసల్ బీమా రైతులకు ధీమా

- బీమా పథకం పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఫసల్ బీమా పథకంతో రైతులకు ధీమా కలుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో తుపానులు, కరువు, అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంతో ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ పథకంపై ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి ఉండాలన్నారు. నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ పథకానికి అర్హులన్నారు. వరి పంటకు ప్రతి ఎకరానికి రూ.42 వేల బీమా ఉందన్నారు. రైతు ప్రీమియం వాటా ఎకరానికి రూ.84 ఉంటుందన్నారు. వేరుశనగకు ఎకరాకు రూ.30 వేలు బీమా ఉండగా, రైతు ప్రీమియం వాటా ఎకరానికి రూ.60 ఉన్నట్లు తెలిపారు. వరి పంటకు ఈ నెల 31వ తేదీ, వేరుశనగకు ఈ నెల 15వ తేదీ లోపు బీమా చెల్లించేందుకు ఆఖరి తేదీ అని వెల్లడించారు. ఇతర వివరాలకు 1800 209 3536 టోల్ ఫ్రీ నెంబర్ లో సంప్రదించవచ్చన్నారు.

టమాట పంటకు బీమా

జిల్లాలో టమాట పంటకు బీమా పొందే అవకాశం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆ పథకం రబీ 2024–25 పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో టమాట పంట సాగు చేస్తున్న రైతులు ఈ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో టమాట పంటకు బీమా ఇచ్చేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. బీమా పొందాలనుకునే రైతులు ముందుగా ప్రీమియం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఒక ఎకరా పంటకు రూ.1250 ప్రీమియం చెల్లిస్తే రూ.25 వేల బీమాకు అర్హులవుతారన్నారు. ప్రీమియం ఈ నెల 15 వ తేదీ లోపు చెల్లించాలన్నారు. అక్టోబర్ 1 వ తేదీ నుంచి టమాట సాగు చేసిన రైతులు అర్హులవుతారని తెలిపారు. ఇతర వివరాలకు 9704993284 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులు మధుసూదన్‌రెడ్డి, మురళీకృష్ణ, ప్రభాకర్, ఎల్‌డీఎం హరీష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం



ధ్వంసం అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం

శ్రీరంగరాజపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన శ్రీరంగరాజపురం మండలంలోని పాతపాళ్యం దళితవాడలో చోటుచేసుకుంది. స్థానికుల ఫిర్యాదుతో సీఐ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వర్షం రావడంతో ఆధారాలు తొలగిపోయినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులు అందించిన సమాచారంతో ఓ అనుమానుతుడిని పట్టుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారించి ఈ దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హనుమంతప్ప తెలిపారు.

రెండు వారాల్లో కారుణ్య నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలో కారుణ్య నియామకాల ప్రక్రియ రెండువారాల్లో పూర్తి చే స్తామని సీఈఓ రవికుమార్ నాయుడు తెలిపారు. సోమ వారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓను ఎస్టీ యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఆర్థిక కార్యదర్శి మదన్ మోహన్ రెడ్డి, బోడేమోహన్ యాదవ్, యువరాజులు కలిసి, చర్చించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కారుణ్య నియామకాల్లో జాప్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అనంతరం జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంట్ సహా అర్హత గల మిగిలిన పోస్టులను కూడా నిబంధనల మేరకు భర్తీ చేస్తామని తెలిపారు.

పరమదయాకరి



తిరుచానూరు బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పద్మావతీ అమ్మవారు ఉదయం పల్లకిలో మోహినీ అలంకారంలో, రాత్రి గజవాహనంపై మహాలక్ష్మి అవతారంలో ఊరేగారు. భక్తులు వాహనసేవలో అమ్మవారిని దర్శించుకున్నారు. - చంద్రగిరి

బావిలో శవంగా తేలిన అదృశ్యమైన వ్యక్తి



బావిలో తేలిన విజయేంద్ర మృతదేహం

గంగవరం: గత శనివారం అదృశ్యమైన వ్యక్తి బావిలో శవమై తేలాడు. ఈ సంఘటన గంగవరం మండలంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం పొట్టగానిపల్లి గ్రామానికి చెందిన విజయేంద్ర(45) గత శనివారం ఇంటి నుంచి వెళ్లి పోయాడు. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పలుచోట్ల ఎంత గాలించినా ఆచూకీ దొరకలేదు. అలా అదృశ్యమైన వ్యక్తి తరచూ తాను మద్యం సేవించే కల్లుపల్లి సమీపంలోని పాడుబడ్డ బావిలో సోమవారం ఉదయం శవమై తేలాడు. అంతకు ముందు రోజు ఆదివారం అదే బావిలో కుటుంబసభ్యులు రోజంతా గాలించినా అతని జాడ లభించకపోవడంతో అక్కడి నుండి వెనుదిరిగారు. కాగా మరుసటి రోజు అదే బావిలో అతను శవమై తేలడంతో బావిలో పడి మృతి చెందినట్టు నిర్ధారించారు. మద్యం సేవించడం కోసం వచ్చి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెంది ఉంటాడా? లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే పలు అనుమానాలు వ్యకమవుతున్నాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు దిగుతూ కాలుజారి పడి వ్యక్తి మృతి

పలమనేరు: బస్సుదిగుతూ కాలు జారి రోడ్డుపై పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. కుప్పం మండలం అనిమిగానిపల్లికి చెందిన ధనుంజయ(50) కుప్పం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో పలమనేరుకు బయలుదేరాడు. నాగమంగళం వద్ద బస్సు దిగుతూ కాలుజారి రోడ్డుపై పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.

సివిల్ వివాదంలో పోలీస్ ఓవరాక్షన్

ముస్లిం యువకుడిపై ఏఎస్ఐ దాడి



ఏఎస్ఐ చేతిలో దెబ్బలు తిన్న మహబూబ్‌బాషా

పుంగనూరు: సివిల్ వివాదాల్లో పోలీసుల ఓవరాక్షన్ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తోంది. ప్రశాంతంగా ఉన్న పుంగనూరులో పోలీసులే వివాదాలకు కేంద్ర బింధువు కావడం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. సోమవారం ఓ డబ్బులావాదేవీ కేసులో ఏఎస్ఐ దామోదరం ముస్లిం యువకుడిని దూషించి కొట్టడం వివాదస్పదమైంది. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన మహబూబ్‌బాషా కోళ్ల వ్యాపారం చేసి జీవిస్తున్నాడు. సిద్ధిక్ అనే వ్యక్తి వద్ద ఇతను తరచూ కోళ్లను కొనుగోలు చేస్తాడు. ఇలా ఉండగా కోళ్లకు చెల్లించాల్సిన డబ్బు రూ.2.50 లక్షలు సకాలంలో ఇవ్వకపోవడంతో సిద్ధిక్ మహబూబ్‌బాషాను బెదిరించి చెక్ తీసుకున్నాడు. కానీ సిద్ధిక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏఎస్ఐ దామోదరం మహబూబ్‌బాషాను పిలిపించి, స్టేషన్‌లో దుర్భాషలాడుతూ కొట్టడంతో ఎడమ కన్ను, చెవి తీవ్రంగా వాచిపోయాయి. బాధితుడు ఎందుకు కొడుతున్నావని అడగ్గా స్టేషన్‌లో ఉన్న పోలీసులందరూ ఏఎస్ఐకి మద్దతు ఇచ్చారని బాధితుడు విలేకరులకు తెలిపాడు. దీనిపై పట్టణ ముస్లింలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏఎస్ఐపై చర్యలు తీసుకోవాలని, సివిల్ వ్యవహారల్లో పోలీసులు జోక్యం చేసుకోవడం బాధకరమని ఆరోపిస్తున్నారు. ఏఎస్ఐపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై సీఐ శ్రీనివాసులు బాధితున్ని పిలిపించి విచారించారు. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు.

సంచుల దుకాణంలో చోరీ

- గల్లాలోని రూ.30 వేల నగదు, 30 గ్రాముల వెండి చోరీ
- సీసీ కెమెరాలో స్పష్టంగా చోరీ దృశ్యాలు



దుకాణంలో చోరీకి పాల్పడుతున్న దొంగ

పలమనేరు: పట్టణంలోని రెక్కమాను ప్రాంతంలో ఉన్న ఓ సంచుల దుకాణంలో ఆదివారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. ఈ విషయమై దుకాణ యజమాని సోమవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన పూహశేంది గోనె సంచుల వ్యాపారం చేస్తున్నాడు. ఆదివారం దుకాణానికి తాళం వేసి ఇంటికెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తాళాన్ని విరగొట్టి దుకాణంలోని గల్లాలో ఉన్న రూ.30వేల నగదు, 40 గ్రాముల వెండి కాయిన్లు చోరీ చేశాడు. దుకాణం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో దొంగ వచ్చి చోరీ చేసిన దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. దీంతో బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నరసింహరాజు ఆదేశాలతో క్రైమ్‌పార్టీ పోలీసులు సంఘటనా స్థలాన్ని సోమవారం పరిశీలించారు. అక్కడి సీసీ కెమెరాలో రికార్డు అయిన పుటేజీ ఆధారంగా కేసును విచారిస్తున్నారు.

విన్నపాలకు విలువ ఇవ్వండి సారూ..!

- కలెక్టర్‌కు అర్జీలు అందజేసిన ప్రజలు
- హాజరైన పలు శాఖల జిల్లా అధికారులు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 101 అర్జీలు నమోదు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : తమ విన్నపాలకు విలువ ఇచ్చి, తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ గోడును వెళ్లబోసుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు శాఖలకు సంబంధించి 101 అర్జీలు నమోదు కాగా, అధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 87 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజలు అందజేసిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేశారు

తమ గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని బంగారుపాళెం మండలం మహాసముద్రం దళితవాడ వాసులు వాపోయారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ గ్రామానికి చెందిన సెల్వం మాట్లాడుతూ తమ గ్రామంలో గ్రామకంఠం సర్వే నంబర్ 155/3 లో 2.72 ఎకరాల భూమిలో 45 కుటుంబాలు నివసిస్తున్నట్లు చెప్పారు. అక్కడే 30 సెంట్లల్లో అగ్రకులాలకు చెందిన వారు గృహాలు నిర్మించుకున్నారన్నారు. అగ్రకులాలకు చెందిన వ్యక్తులు దారి సమస్యను సృష్టించి భయాందోళనకు గురిచేస్తున్నట్లు తెలిపారు. ప్రశ్నించినందుకు విద్యుత్ సరఫరా నిలిపివేయించారన్నారు.

రానివ్వకుండా అడ్డుకుంటున్నారు

తన పేరుతో ఉన్న భూమిలోకి రానివ్వకుండా అగ్రకులస్తులు అడ్డుకుంటున్నారని గంగవరం మండలం గుండ్రాజుపల్లెకు చెందిన లక్ష్మమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. దివ్యాంగుడైన తన కుమారుడితో కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు సోమవారం కలెక్టరేట్ కు విచ్చేసింది.

దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు

తన పేరుతో ఉన్న భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని బంగారుపాళెం మండలం మంగళంపల్లెతకు చెందిన దివ్యాంగుడు మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో తనకు 0.93 ఎకరాల భూమి ఉందని, దాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకుని బెదిరిస్తున్నారన్నారు.

బోస్ విగ్రహం ఏర్పాటు చేయాలి

చిత్తూరులో సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వర్షానికి కూలిన పూరిళ్లు



కూలిన ప్రభాకర్ పూరిల్లు

కాణిపాకం: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు యాదమరి మండలంలో రెండు పూరిళ్లు కూలిపోయాయి. చిన్నంపల్లి గ్రామంలో నాయగం అనే వృద్ధురాలి ఇంటి గోడలు పడిపోయాయి. అలాగే పెరుమాళ్లకుప్పం గ్రామానికి చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి పూరిల్లు సైతం కుప్పకూలింది. దీంతో రెవెన్యూ అధికారులు కూలిన ఇళ్లను పరిశీలించి, మండల అధికారులకు నివేదికలు సమర్పించారు.